పేదల ద్రోహి చంద్రబాబు

- ఇళ్ల పట్టాలపై అనుచిత వ్యాఖ్యలు సిగ్గుచేటు
- ఎస్సీ, ఎస్టీ, బీసీల్లాగే పేదలను అవమానించాడు
- పెత్తందార్ల చుట్టూ బడుగులు ఉండరాదనే బాబు కుట్ర
- ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి



రాయదుర్గం: చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

రాయదుర్గం: ఇళ్ల పట్టాల పంపిణీ విషయంలో పేదల మనోభావాలు దెబ్బతినేలా టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు చేసిన అనుచిత వ్యాఖ్యలకు యావత్ రాష్ట్రం తలదించుకోవాల్సి వస్తోందని, పెత్తందార్లకు కొమ్ముకాసే ఈ దురహంకారికి 2024 ఎన్నికల్లో పేదలే సమాధి కట్టబోతారని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. అమరావతిలో పేదలకిచ్చే ఇళ్ల పట్టాలను సమాధులతో పోల్చడంపై రాయదుర్గంలో వైఎస్సార్‌సీపీ నాయకులు భగ్గుమన్నారు. ఆయన వ్యాఖ్యలను ఖండిస్తూ శుక్రవారం విప్ ఆధ్వర్యంలో స్థానిక రోడ్లు, భవనాల శాఖ అతిథి గృహం నుంచి వినాయసర్కిల్ వరకూ భారీ ర్యాలీ చేపట్టారు. పేదల ద్రోహి చంద్రబాబు అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ర్యాలీలోనే బాబుకు శవయాత్ర నిర్వహించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి, రెడ్‌క్రాస్ సంస్థ జిల్లా చైర్‌పర్సన్ కాపు భారతి, మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, మార్కెట్‌యార్డ్ చైర్మన్ భోజరాజ్‌నాయక్, బీసీ, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శులు ఎస్టీ సిద్దప్ప, గోవిందు, జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, బోర్‌వెల్ నాగిరెడ్డి, వైస్ చైర్మన్లు శ్రీనివాస్‌యాదవ్, వలీబాషా, ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, ఐదు మండలాల ఎంపీపీ, జెడ్పీటీసీ, మండల, సచివాలయాల కన్వీనర్లు, సర్పంచులు, ఎంపీటీసీ, కౌన్సిలర్లు, పార్టీ ముఖ్య నాయకులతో కలసి బాబు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా విప్ కాపు మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ, బీసీల్లాగే పేదలను కూడా చంద్రబాబు అవమానించాడన్నారు. పెత్తందార్ల చుట్టూ పేదల నివాసాలు ఉండడం బాబు జీర్ణించుకోలేక కుట్రలకు తెరలేపాడన్నారు. వార్డు సభ్యుడిగా గెలవలేని పప్పునాయుడు నోరు అదుపులోపెట్టుకుని మాట్లాడాలన్నారు. చంద్రబాబు నివాసం ఉండే కరకట్ట ఇల్లు ఓ సారి అద్దెదని, మరోసారి ప్రభుత్వానిదని మోసం చేస్తూ ఎనిమిదేళ్లుగా అద్దెలు కాజేసిన ద్రోహి చంద్రబాబు అని మండిపడ్డారు.

బాబు హయాంలో పేదలకు సెంటు స్థలం ఇవ్వలేదు..

టీడీపీ అధికారంలో ఉండే ఐదేళ్లూ పేదలకు సెంటు స్థలం కూడా చంద్రబాబు ఇవ్వలేదని విప్ కాపు విమర్శించారు. రాష్ట్రంలో 31 లక్షల మంది అక్క, చెల్లెమ్మలకు పట్టాలిచ్చి ఇళ్లు కట్టించే బాధ్యతను సీఎం వైఎస్ జగన్ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారన్నారు. యజ్ఞంలా సాగుతున్న ఈ కార్యక్రమాన్ని చూసి బాబు తట్టుకోలేక పోతున్నాడని ధ్వజమెత్తాడు. అమరావతి తో పాటు తుళ్లూరు, పెదకాకాని, మంగళగిరి, తాడేపల్లి, విజయవాడ ప్రాంతాల్లో 50 వేల మంది పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తుంటే ఎందుకంతా అక్కసు వెళ్లగక్కుతున్నారో అర్థం కావడం లేదన్నారు. అమరావతిలో పేదలకు ఉండే హక్కు లేదా..? ఏమిటీ దౌర్జన్యం..? అంటూ ఘాటుగా సందించారు. హైకోర్టుకెళ్లి స్టే తెచ్చిన దుర్మార్గులు ఈ టీడీపీ ద్రోహులని మండిపడ్డారు. సుప్రీంకోర్టు తీర్పు వారికి చెంపపెట్టులా మారిందన్నారు.

మంత్రిగా ఉండి చేసిందేమిలేదు..

టీడీపీ హయాంలో గృహ నిర్మాణశాఖ మంత్రిగా ఉన్న కాలవ రాయదుర్గంలో ఎన్ని ఇళ్లు కట్టించారు?. మా పాలనలో ఇచ్చిన ఇళ్లు, పట్టాలెన్నో లెక్కలతో చూపిస్తామంటూ విప్ కాపు సవాల్ విసిరారు. నీ డబ్బా సెల్ఫీలతో ప్రజలను మోసం చేయలేవన్నారు. నీ హయాంలో చేతగాక వదిలేసిన రోడ్లను రూ.వందల కోట్ల వ్యయంతో తాము అభివృద్ధి చేస్తున్నామన్నారు. మొన్న హనుమాపురానికి దొంగలా వచ్చి పారిపోయిన నీచ సంస్కృతి నీది కాదా..? అని నిలదీశారు. ఒకటి, రెండు రోజుల్లో నీవు మాట్లాడిన మలపన గుడి లో ఈ నాలుగేళ్లలో చేపట్టిన సంక్షేమం, అభివృద్ధిపై లెక్కల సహా వివరిస్తాం. నీ ఐదేళ్లలో చేసిన ప్రగతిపై మీడియాకు వెల్లడించాలన్నారు. బాబు 14 ఏళ్లలో చేయలేని అభివృద్ధిని ఈ నాలుగేళ్లలోనే సీఎం జగన్ చేసి చూపించారన్నారు. రాయదుర్గ లో కాలవ, రాష్ట్రంలో చంద్రబాబు కు ఇవే ఆఖరి ఎన్నికలు కాబోతున్నాయన్నారు. 175 కు 175 స్థానాల్లో గెలుస్తామని దీమా వ్యక్తం చేశారు. పేదల ఉసురులోనే పచ్చపార్టీ కొట్టుకుపోతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మహేష్, జెడ్పీ మాజీ సభ్యులు నాగిరెడ్డి, వన్నప్ప, మాజీ ఎంపీపీ రాజగోపాల్‌రెడ్డి, పొరాళ్ల శివ, మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మన్ మేకల శ్రీనివాసులు, వాల్మీకి నాయకుడు తొండె వెంకటేశులు, కౌన్సిలర్లు, ఐదు మండలాలకు చెందిన పార్టీ ముఖ్యనాయకులు పాల్గొన్నారు.



బొమ్మనహాళ్: తారకాపురంలో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న విప్

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

బొమ్మనహాళ్: అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ అవినీతి రహితంగా ప్రభుత్వ పథకాలను అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని ప్రభుత్వ విప్ కాపురామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని తారకాపురం, కల్లుదేవనహళ్లి, గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. విప్ ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నంతకాలం పేదల భవిష్యత్‌కు ఢోకా లేదని, వచ్చే ఎన్నికల్లో జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం వైస్ జగనన్నకే దక్కిందన్నారు. హామీలు అమలు చేయకుండా అన్ని వర్గాలనూ మోసం చేసిన చంద్రబాబును నమ్మొద్దన్నారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్ కాపు భారతి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత చంద్రశేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రమేష్, నాయకులు దర్గన్న, వన్నూరుస్వామి, తిప్పేస్వామి, కోటేశ్వరరెడ్డి, వన్నల్లి రామాంజినేయులు, వీరన్నగౌడ్, మాబుసాబ్, గాదిలింగ, రమేష్, నాగరాజు, రామకృష్ణ, కృష్ణ, మనోహర్‌శెట్టి, ముక్కన్న, సురేష్ స్వామి, దివాకర్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అడవుల పరిరక్షణ అందరి బాధ్యత



కుందుర్పి: పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ అధికారులు



వజ్రకరూరు: అవగాహన కల్పిస్తున్న ఎఫ్‌ఎస్‌ఓ కరీముల్లా

కుందుర్పి: అడవుల పరిరక్షణ ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని కళ్యాణదుర్గం అటవీశాఖ డీప్యూటీ రేంజర్ బ్రహ్మయ్య సూచించారు. శుక్రవారం మండలంలోని అప్పిలేపల్లిలో పర్యావరణ, అడవుల పరిరక్షణ, మొక్కల పెంపకంపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ మొక్కల పెంపకం విరివిగా చేపట్టాలని సూచించారు.ఈ సందర్భంగా స్థానిక ఉన్నత పాఠశాల, గ్రామ సచివాలయ ఆవరణ తదితర ప్రాంతాల్లో సర్పంచ్ అతావుల్లా ఆధ్వర్యంలో 2వేల మొక్కలను నాటారు. కార్యక్రమంలో జంబుగుంపల అటవీ బీట్ ఆఫీసర్ పరమేశ్వరప్ప, గ్రామస్తులు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రకృతిని కాపాడుకుందాం

వజ్రకరూరు: ప్రకృతిని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ కరీముల్లా, సర్పంచు ఉమామహేశ్వరి సూచించారు. శుక్రవారం మండలంలోని పందికుంట గ్రామంలో అటవీశాఖ ఆధ్వర్యంలో లైఫ్‌స్టైల్ కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మొక్కల పెంపకం, ప్లాస్టిక్ నిషేధం, ప్రకృతిని కాపాడటం, జంతువులను ప్రేమించడం తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. అనంతరం గ్రామస్తులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ సతీష్, పామిడి, గుత్తి సెక్షన్ల అధికారులు పాల్గొన్నారు.

అర్హులైన గిరిజన రైతులకు సాగుపట్టాలు



గిరిజన రైతులు సాగు చేసుకుంటున్న అటవీ భూములను పరిశీలిస్తున్న డీటీడబ్ల్యూఓ అన్నాదొరై తదితరులు

వజ్రకరూరు: అర్హులైన గిరిజన రైతులందరికీ సాగు హక్కు పట్టాలు అందజేస్తామని గిరిజన సంక్షేమ అధికారి అన్నా దొరై అన్నారు. శుక్రవారం మండలంలోని ఎస్‌ఎస్‌పీతండా గ్రామంలో గిరిజన రైతులు సాగుచేస్తున్న అటవీ భూములను అధికారులు పరిశీలించారు ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలసి అటవీభూములు సాగుచేస్తున్న గిరిజన రైతులకు వెంటనే సాగు హక్కు పట్టాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నేపథ్యంలో జిల్లా ట్రిబల్ అధికారులు, ఫారెస్ట్ రెండో రోజులుగా మండలంలో పర్యటించి గిరిజనులు సాగు చేస్తున్న అటవీ భూములను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి గిరిజన రైతుకూ న్యాయం చేస్తామన్నారు. తమ సంక్షేమానికి కృషిచేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వకు గిరిజన రైతులు కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచు కవితాభాయి, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ కరీముల్లా, అకౌంటెంట్ వెంకటేశ్వర్లు, బీట్ అధికారి సతీష్‌కుమార్, గిరిజనులు పాల్గొన్నారు.

కేబుల్ అపహరణ

గుమ్మఘట్ట: మండలంలోని కె.పి.దొడ్డి గ్రామ పరిసర ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు విద్యుత్ కేబుల్‌వై అపహరించుకెళ్లారు. గ్రామానికి చెందిన గొల్ల తిప్పేస్వామి, గొల్ల గోవిందప్ప, మాదిగ వన్నూరప్ప, కెంచప్ప, గొల్ల లింగప్ప, పరమేశ్వర, బ్రహ్మనందారెడ్డి పొలాల్లో వ్యవసాయ విద్యుత్ మోటార్లకు చెందిన కేబుల్, సర్వీసు వైర్లను గుర్తుతెలియని వ్యక్తులు కత్తిరించి.. అక్కడే మంటల్లో కాల్చి అందులోని కాపర్‌ను ఎత్తుకెళ్లినట్లు బాధిత రైతులు వాపోయారు. నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు కోరారు.

రైతు ఇంట సిరుల పంట



వడ్లను ఆరబెడుతున్న అన్నదాతలు

- బీటీపీ ఆయకట్టులో పూర్తయిన పంటలు
- సంతోషం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

గుమ్మఘట్ట: నియోజకవర్గ వరప్రదాయని భైరవానితిప్ప ప్రాజెక్టు పరిధిలో కుడి, ఎడమ కాలువ కింద ఆయకట్టులో అన్నదాతలు సాగు చేసిన పంటలు చేతికి వచ్చాయి. గత సంవత్సరం ఆగస్టులో బీటీ ప్రాజెక్టుకు వరద ప్రారంభమై సెప్టెంబర్ లో పొంగిపొర్లింది. దాదాపు 150 రోజులు పాటు వేదావతి హగరి నిరంతరాయంగా జీవనదిలా పరవళ్లు తొక్కుతూ ప్రవహించింది. గత ఏడాది డిసెంబర్‌లో కుడికాలువ కింద 1వ తూము నుంచి 14వ తూము వరకూ 5,430 ఎకరాలకు, ఎడమ కాలువ 6వ తూము నుంచి చివరి ఆయకట్టు వరకూ 1,800 ఎకరాలకు అధికారులు సాగునీరు వదిలారు. పంట కాలం పూర్తయ్యేవరకూ సాగునీరు వదలడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పంట కాలం పూర్తి కావడంతో అన్నదాతలు పంటలను తొలగించే పనుల్లో నిమగ్నమయ్యారు. కాగా ఈ ఏడాది రైతులు వరితో పాటు మొక్కజొన్న, పత్తి, వేరుశనగ పంటలను సాగు చేసి అధిక దిగుబడి సాధించారు. పలువురు రైతులు ఆర్‌ఎస్‌ఆర్ వరి రకం సాగు చేసి ఎకరాకు 40 నుంచి 50 బస్తాల వరకూ దిగుబడి సాధించారు. అలాగే మొక్కజొన్న పంట ఎకరాకు 45 బస్తాల నుంచి 50 బస్తాల వరకూ పండించారు. వరి క్వింటాల్ రూ.2,040 నుంచి రూ. 2,060 వరకూ విక్రయిస్తున్నారు. మొక్కజొన్న క్వింటాల్ రూ.1,850 నుంచి రూ.1900కు విక్రయిస్తున్నారు. దిగుబడి బాగుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఎకరాకు 50 బస్తాల వరి పండించా



ఎకరాకు 50 బస్తాల వరకు వరి పండించాం. ఆయకట్టుకు ఎలాంటి లోపాలు లేకుండా సక్రమంగా సాగు నీటిని అందించడం, ఆర్బీకేల్లో ఎరువులు అందుబాటులో వుంచడంతో పాటు సకాలంలో పంటకు అందించడంతో అధిక దిగుబడులు సాధించేందుకు వీలయింది.వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించడంతో అధిక దిగుబడులు సాధించాం. క్వింటాల్‌కు రూ.2040లకు విక్రయించా.

– నాగేంద్రప్ప, రైతు, కలుగోడు

ఇబ్బందులు లేకుండా సాగు నీరు వదిలాం



ఆరు నెలల కాలానికి సాగు నీటిని ఎలాంటి ఇబ్బందులు లేకుండా వదిలాం. ప్రారంభంలో కాలువల మరమ్మతులకు నిధు లు లేకపోవడంతో సమస్యను ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లాం. స్పందించిన ఆయన కలెక్టర్‌తో మాట్లాడి సకాలంలో సమస్యను పరిష్కరించారు. ప్రజాప్రతినిధులు, రైతులు సహకరించడంతో నీటి సమస్యలు ఉత్పన్నం కాలేదు.

– వెంకటరమణ, ఇన్‌చార్జ్ డీఈఈ, జలవనరులశాఖ


నేటి నుంచి 'వలంటీర్లకు వందనం'

- మూడు కేటగిరీల్లో అవార్డుల ప్రదానం
- హర్షం వ్యక్తం చేస్తున్న వలంటీర్లు

నియోజకవర్గం	సచివాలయాలు	వలంటీర్లు
రాయదుర్గం	96	1499
కళ్యాణదుర్గం	76	1395
ఉరవకొండ	84	1114

రాయదుర్గం: పైసా అవినీతికి తావులేకుండా ప్రభుత్వ సేవలన్నీ ప్రజల గడప వద్దకే చేరవేస్తూ..ప్రజాసేవే పరమావధిగా ఉత్తమ సేవలు అందించిన వలంటీర్లకు మూడు కేటగిరీల్లో అవార్డుల ప్రదానం చేసేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. శుక్రవారం విజయవాడలో ఈ కార్యక్రమాన్ని లాంచనంగా ప్రారంభించారు. సేవకు ప్రతిఫలంగా వరుసగా మూడో ఏడాది వారిని ఘనంగా సత్కరించి ప్రోత్సహించేలా కీలక చర్యలు చేపట్టారు. దీంతో ప్రతి నియోజకవర్గంలోనూ ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని దిగ్విజయవంతం చేసేలా అధికారులు ప్రణాళికలు చేపట్టారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో 256 గ్రామ/వార్డు సచివాలయాలు ఉండగా, మొత్తం 4,008 మంది వలంటీర్లు విధులు నిర్వహిస్తున్నారు. ప్రతి నియోజకవర్గం నుంచి సేవావజ్ర అవార్డుకు ఐదుగురిని ఎంపిక చేసి, రూ.30 వేలు, ప్రతి మండలం నుంచి ఐదుగురిని సేవారత్న అవార్డుకు ఎంపిక చేసి రూ.20 వేల నగదు, ఫిర్యాదులు లేకుండా ఏడాదికి పైగా పనిచేసిన వలంటీర్లను సేవామిత్ర ద్వారా రూ.10 వేల నగదు, ప్రశంశపత్రాలు, మోడల్, బ్యాడ్జీ, శాలువాలతో సత్కరించనున్నారు. శనివారం కణేకల్లులో విప్ కాపు రామచంద్రారెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు.


సంతోషంగా ఉంది



సేవా వజ్రకు ఎంపిక చేయడం చాలా సంతోషంగా ఉంది. రూ.20 వేల నగదుతో పాటు బ్యాడ్జీ, ప్రశంసాపత్రం, శాలువాతో సత్కరిస్తుండడం గర్వంగా ఫీలవుతున్నాను. వలంటీర్ల సేవలు కొంత మందికి తేలిగ్గా కనిపిస్తున్నా.. సేవలు అందుకుంటున్న ప్రజలకు మా విలువెంటో తెలుస్తోంది. సీఎం జగన్ కు వలంటీర్లు రుణపడి ఉంటాం.

– చాకలి అనిత, 9వ సచివాలయం, రాయదుర్గం

అర్హతే ప్రామాణికం



అవార్డుల ఎంపికలో వలంటీర్ల అర్హతనే ప్రామాణికంగా తీసుకున్నాం. సచివాలయాల్లో బయోమెట్రిక్ హాజరు, పింఛన్ల పంపిణీ, ఫీవర్ సర్వే, ఇతర సేవలకు పాయింట్లు కేటాయించి మూడు విభాగాల్లో అవార్డులు అందజేస్తాం. అన్న మండలాల్లోనూ ఈ కార్యక్రమాలు విజయవంతం చేసేలా పటిష్ట చర్యలు చేపట్టాం.

– శంకర్, డీఎల్‌డీఓ, కళ్యాణదుర్గం క్లస్టర్

క్లుప్తంగా

సువార్త స్వస్థత సభల పోస్టర్ల విడుదల



పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం: ఉరవకొండ పట్టణంలోని దేవాంగ కల్యాణ మండపంలో ఈనెల 26, 27న నిర్వహించే ఉజ్జీవ సువార్త స్వస్థత సభలను జయప్రదం చేయాలని కళ్యాణదుర్గం నియోజకవర్గ పాస్టర్ల సంక్షేమ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని పలు వీధుల్లో సంఘం అధ్యక్షుడు బిషప్ డాక్టర్ రెవరెండ్ జాన్సన్‌బాబు, పాస్టర్ ఆనంద్, జిల్లా క్రిస్టియన్ మైనార్టీ నాయకులు జోసెఫ్ కిశోర్ పర్యటించి స్వస్థత సభల పోస్టర్లను అందించి ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో చర్చి సభ్యులు ఆర్డర్‌బాబు, చర్చి కమిటీ అధ్యక్షుడు రాజశేఖర్ చౌదరి, విక్టరీ మినిస్ట్రీస్ పౌండర్ రీటాజాన్సన్, యోషయా, శరణ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

మోడల్ పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

శెట్టూరు: మండల కేంద్రంలోని ఏపీ మోడల్ కళాశాలలో ప్రవేశం కోసం విద్యార్థులు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ గాయత్రి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి ఉత్తీర్ణత పొందిన విద్యార్థులు ఇంటర్ ప్రవేశానికి రఖాస్తును చేయవచ్చన్నారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ విద్యా కోర్సులు ఉన్నాయన్నారు. ఆ యా కోర్సులపై ఆసక్తిగల విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 22 నుంచి జూన్ 7 వరకూ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.150, ఓసీ, బీసీ విద్యార్థులు రూ.200 దరఖాస్తు రుసుం చెల్లించాలన్నారు.

పేపర్ ఆర్ట్, చిత్ర లేఖనంపై శిక్షణ



పిల్లలు తయారు చేసిన బొమ్మలను చూపుతున్న దృశ్యం

కూడేరు: సమ్మర్ క్యాంపులో భాగంగా స్థానిక గ్రంథాలయంలో శుక్రవారం విద్యార్థులకు గ్రంథాలయాధికారిణి రాధారాణి పేపర్ ఆర్ట్ , చిత్ర లేఖనంపై శిక్షణ ఇచ్చారు. అద్భుతంగా పేపర్‌తో బొమ్మలు తయారు చేసిన విద్యార్థులను గ్రంథాలయాధికారిణి అభినందించారు. ఆమె మాట్లాడుతూ పిల్లల్లో సృజనాత్మకతను వెలికి తీయడానికే ప్రభుత్వం సమ్మర్ క్యాంపు ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది రంగయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ పకడ్బందీగా నిర్వహించాలి

గుమ్మఘట్ట: 2022–2023 సంవత్సరానికి ఉపాధి పథకంలో మండల వ్యాప్తంగా జరిగిన 749 పనులపై సామాజిక తనఖీలను పకడ్బందీగా నిర్వహించాలని ఎస్ఆర్‌పీ వెంకటేశ్‌నాయక్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో డీఆర్‌పీలు, వీఎస్‌ఏలతో సమన్వయ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. 20వ తేదీ నుంచి వారం రోజుల పాటు గ్రామసభలు నిర్వహించి తనిఖీలను నిష్పక్షపాతంగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఓ సురేశ్, పీఆర్ ఏఈ లక్ష్మీనారాయణ, టీఏలు, ఎఫ్‌ఏలు, సీఓలు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డు డైరెక్టర్‌కు సన్మానం



డైరెక్టర్, సచివాలయ కన్వీనర్‌ను సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కుందుర్పి: ఇటీవల ఎంపికైన మండల సచివాలయ కన్వీనర్ ఈ.రాము, మార్కెట్ యార్డు డైరెక్టర్ తెనగల్లు లింగప్పను శుక్రవారం మండల వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సత్యనారాయణశాస్త్రి, సింగిల్ విండో అధ్యక్షుడు వన్నూర్‌రెడ్డి, జెడీ మాజీ సభ్యుడు రాజగోపాల్, కరిగానిపల్లి మాజీ సర్పంచ్ తిప్పేస్వామి, యువజన నాయకుడు నిజవళ్లి బాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటిద్దాం

కుందుర్పి: రోడ్డు భద్రత నియమాలను పాటించి ప్రమాదాలను నివారిద్దామని ఎస్కే చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు లెనిన్‌బాబు సూచించారు. మండలంలోని నిరుద్యోగ యువకులకు అభయ ఫౌండేషన్ , ఎస్కే చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత డ్రైవింగ్ శిక్షణను ప్రారంభించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో బాల్య వివాహాల కట్టడి

కళ్యాణదుర్గం: అధికారుల సమష్టి కృషితో బాల్య వివాహాలను నివారిద్దామని మండల ప్రత్యేక అధికారిణి, సీడీపీఓ లక్ష్మీ ప్రసన్న సూచించారు. మండలంలోని బోరంపల్లి, పీటీఆర్‌పల్లిలో శుక్రవారం బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ బాల్య వివాహాలు జరగకుండా నివారించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. బాల్య వివాహం వల్ల ఆడపిల్లలు తమ హక్కులను కోల్పోవడంతో పాటు శారీరకంగా, మానసికంగా అనేక ఇబ్బందులకు గురవుతారన్నారు. అమ్మాయికి 18 సంవత్సరాలు, అబ్బాయికి 21 సంవత్సరాలు వచ్చిన తర్వాతనే వివాహం చేయాలన్నారు. అనంతరం ప్రజల్లో అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బాలాజీ, ముద్దినాయనపల్లి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ విజయేంద్ర, ఆరోగ్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలలను సీజ్ చేయండి



ఎంఈఓ విజయకుమారికి వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

కళ్యాణదుర్గం: పట్టణంలో ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలను వెంటనే సీజ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఎంఈఓ విజయకుమారిని కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రైవేట్ విద్యాసంస్థలు ముందస్తు ప్రచారంతో పలు చోట్ల బ్యానర్లు ఏర్పాటు చేసి ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. వెంటనే ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకుని సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంఈఓ విజయకుమారికి అందజేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు హనుమంతరాయుడు, తాలూకా ఉపాధ్యక్షుడు సాయికుమార్‌నాయక్, పట్టణ నాయకులు సుదీప్, మారుతి, ప్రణీత్, ధనుష్ పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో మంచి నీరు లేక అవస్థలు

కూడేరు: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో తాగు నీటి వసతి లేక శుక్రవారం గర్భిణులు, రోగులు ఇబ్బంది పడ్డారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి గర్భిణులు, రోగులు వైద్యం కోసం పీహెచ్‌సీకి వచ్చారు. కానీ అధికారులు ఒక క్యాన్‌లో నీరు పెట్టి చేతులు దులిపేసుకున్నారు. అవి తొందరగా అయిపోవడంతో ఎండకు రోగులు నీటి కోసం ఇబ్బంది పడ్డారు. మరోవైపు కాన్పుల గది, మరుగుదొడ్లలోకి నీటి సరఫరా లేక సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. కొన్నేళ్ల క్రితం మంచి నీటి కోసం వేసిన బోరులో నీరు అడుగంటి పోవడంతో సమస్య నెలకొంది. అధికారులు స్పందించి మరో బోరు వేయించి శాశ్వతంగా నీటి సమస్య తలెత్తకుండా చూడాలని మండలవాసులు కోరుతున్నారు.

మండలానికి చేరిన 'జగనన్న విద్యా కానుక' కిట్లు



బ్యాగుల నాణ్యతను పరిశీలిస్తున్న ఎంఈఓ చంద్రశేఖర్

కూడేరు: 2023–24కు సంబంధించి జగనన్న విద్యా కానుక పథకం కింద బ్యాగులు, బెల్టులు శుక్రవారం మండలానికి చేరుకున్నాయి. వాటిని స్థానిక ఎమ్మార్సీలో భద్రపరిచారు. ఎంఈఓ చంద్రశేఖర్, సీఆర్పీలు, ఐఈఆర్టీలు, వైకేపీ సీసీలు, యానిమేటర్లు బ్యాగులు, బెల్టుల నాణ్యతను పరిశీలించారు. ఎంఈఓ మాట్లాడుతూ 3,840 బెల్టులు, బ్యాగులు సరఫరా అయ్యాయన్నారు.

ఘనంగా అమావాస్య పూజలు

వజ్రకరూరు: స్థానిక నగరేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం అమావాస్య పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు, అర్చనలు, మహామంగళహారతి, తీర్థప్రసాద వినియోగం తదితర కార్యక్రమాలు చేపట్టారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. అలాగే భోగేశ్వరస్వామి, రామేశ్వరస్వామి ఆలయాల్లో కూడ అమావాస్య పూజలు చేపట్టారు. మండలంలోని జరుట్లరాంపురంలో ఉన్న రామలింగేశ్వరస్వామి ఆలయంలో అమావాస్య పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.